క్లుప్తంగా

ఆస్పత్రికి ఆర్వోప్లాంట్ వితరణ



ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, తదితరులు

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పట్టణానికి చెందిన పల్లా కొండలరావు ముందుకొచ్చారు. సుమారు లక్ష రూపాయలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, ఆర్ఎంఓ రవీంద్రకుమార్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని శనివారం పరిశీలించారు. దీంతో పాటు రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు వీలుగా సిమెంట్ బెంచీలను అందించనున్నట్లు కొండలరావు చెప్పారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్లు పాడవటం, విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని మరుపెంట పంచాయతీ తులసిరామినాయుడువలసలో 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. ఏఈ బి.శంకరరావు పర్యవేక్షణలో సిబ్బంది వైర్లను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మొహర్రం పండగ విశిష్టతను వివరిస్తున్న ముస్లిం మత పెద్ద షేక్ రజా

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలో మొహర్రం వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే జామియా మసీదుకు చేరుకున్న ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం మొహర్రం విశిష్టతను మత గురువు షేక్ రజా వివరించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ ఇబ్రహీం హుస్సేన్, షేక్ సఫీ, షేక్ జలాల్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 280 మంది ఎంపిక



నియామకపత్రాలను చూపిస్తున్న అభ్యర్థులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా మొత్తం 280 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జాబ్ ఫెయిర్-2023 పేరిట వర్క్ రూట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్ర, శనివారం నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు మొత్తం 410 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. అయితే ఎంపికైన వారిలో తొలి 50 మందికి శనివారం ఉద్యోగ నియామకపత్రాలు అందజేశామని, మిగిలిన వారికి వారం రోజుల్లో నియామకపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గంగాధర్, మారుతీకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో పారిశుద్ధ్య పనులు



పెదబోగిలి చర్చి దగ్గరున్న చెత్తను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని పెదబోగిలి గ్రామంలో గ్రామపెద్ద బి.శ్రీనివాసరావు పారిశుద్ధ్య పనులు చేపట్టి, తనలోని సేవాభావాన్ని చాటుకున్నారు. స్వచ్ఛందంగా ఓ ట్రాక్టర్‌తో గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. చర్చి సమీపంలో ఉన్న చెత్త నిల్వల ద్వారా దుర్వాసన వెదజల్లడంతో పాటు వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆయన ఈ మంచి పని చేసినట్లు గ్రామస్తులు అభినందిస్తున్నారు.

సర్కారు బడుల సత్తా..

- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తమ ఫలితాలు
- అదే స్థాయిలో ట్రిపుల్ ఐటీ సీట్లు కైవసం
- సత్తాచాటుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తలవరం ఉన్నత పాఠశాల

వీరఘట్టం: సర్కారు బడుల్లో చదువుకున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సత్తా చాటుతున్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందడంలో ముందుంటున్నారు. దీనికి కారణం విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలే. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించింది. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల అమలుతో సర్కారు బడుల్లో ప్రవేశాలు పెరిగాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తోంది. సర్కారు లక్ష్యానికి ఉపాధ్యాయుల కృషి తోడవడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

ఆ పాఠశాలల్లో ఏటా ఉత్తమ ఫలితాలే..

పదో తరగతి ఫలితాల్లో, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించంలో మండలంలోని నీలానగరం, తలవరం, బిటివాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరోసారి రికార్డు నెలకొల్పాయి. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులో ఉండటంతో పాటు ఉపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణ, ప్రణాళికా బద్ధంగా బోధన, క్విజ్, డిబేట్, వ్యాసరచన, గ్రూప్ డిస్కషన్ వంటి పోటీల నిర్వహణతో విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంతో ఇక్కడి విద్యార్థులు ఉత్తమంగా రాణిస్తున్నారు. బిటివాడ పాఠశాల విద్యార్థి వంజరాపు కార్తీక్ ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. చౌడాడ గోపిచంద్ 567, సింగారపు వెంకటలక్ష్మి 544 మార్కులు సాధించి పాఠశాల టాపర్లుగా నిలిచారు. అలాగే వీరు ముగ్గురూ ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. గత మూడేళ్లుగా ఈ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. తలవరం, నీలానగరం పాఠశాలల నుంచి గత మూడేళ్లలో ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

ప్రవేశాల సంఖ్య పెరిగింది



ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, ఇతర పథకాలతో పాటు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో ప్రవేశాల సంఖ్య పెరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకారం అందిస్తున్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందుకు అణుగుణంగా బోధన చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించగలిగాం.

– ఉప్పాడ అప్పారావు, హెచ్ఎం, తలవరం జెడ్పీ హైస్కూల్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతీ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. అందుకే పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాం. గత నాలుగేళ్లుగా పదో తరగతిలో గరిష్ట మార్కులతో పాటు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. అంతే కాకుండా ట్రిపుల్ ఐటీలో మా పాఠశాల విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు.

– సీహెచ్.రత్నాకరరావు, హెచ్ఎం, బిటివాడ జెడ్పీహెచ్ఎస్

ఎమ్మెల్యే పరామర్శ



మీనక అయోధ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని జి.శివడ ఎంపీటీసీ సభ్యుడు మీనక అయోధ్య(63) శుక్రవారం అనారోగ్యంతో తన స్వగ్రామమైన మద్దుగూడలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కస్పాగదబవలస గ్రామంలో కురుపాం జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత చిన్నాన్న అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పద్మావతి, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీటీసీ విద్యారాణి, జి.శివడ సర్పంచ్ మిన్నారావు, పార్టీ నాయకులు అంధవరపు కోటేశ్వరరావు, శెట్టి నాగేశ్వరరావు, రామకృష్ణ, రేవు సత్తిబాబు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి బి.ప్రజ్ఞ

కురుపాం: మలేరియా జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ సూచించారు. మండలంలోని లంకాజోడు గిరిజన గ్రామంలో శనివారం ఇంటింటా దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహనరావు, ఆరోగ్య సహాయకులు జె.తిరుపతిరావు, కేశవ, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీరు తరలింపు



కల్వర్టు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్ ప్రసాద్, ఫాల్గుణరావు

భామిని: మండలం నులకజోడు గ్రామంలో మురుగునీరు తరలింపునకు శనివారం యుద్ధప్రాతిపదికన కల్వర్టులు ఏర్పాటు చేశారు. వీధికాలువలు పూడికలతో నిండిపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వీధుల్లో నీరు చేరింది. మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, సచివాలయ కన్వీనర్ సాపుపిల్ల ఫాల్గుణరావు ఆధ్వర్యంలో రోడ్డును తవ్వి సిమెంట్ పైపులతో కల్వర్టు నిర్మించారు.

సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: మండలంలోని 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ ఆడిట్ బృందాలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.17.11 కోట్ల వ్యయంతో 816 పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల నాణ్యత, ఖర్చు తదితర వివరాలను పక్కాగా ఆడిట్ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, ఏపీఓ జి.సత్యంనాయుడు, ఎస్ఆర్‌పీలు గోవిందరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రవజీవామృతంతో చీడపీడల నివారణ



ద్రవజీవామృతం తయారీని వివరిస్తున్న సొంబ్రో

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల నివారణకు ద్రవజీవామృతం వినియోగించాలని ఏపీసీఎన్ఎఫ్ ఐసీఆర్‌పీ వి.సోంబ్రో, వెలుగు ఏపీఓ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని చింతలగూడలో ప్రకృతి వ్యవసాయం, చీడపీడల నివారణ, జీవామృతాల తయారీపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. వరితో పాటు పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో సస్యరక్షణకు ద్రవజీవామృతాన్ని వినియోగించవచ్చన్నారు. ప్రకృతిలో అందుబాటులో ఉండే పదార్థాలతో దీన్ని సులభంగా తయారు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వెలుగు ప్రతినిధి భాగ్యలక్ష్మి, సీఏఫ్ కమల పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



పాలకొండ రూరల్: భాసూరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, అధికారులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో ధృవపత్రాలు పంపిణీ చేస్తున్న జనార్దనరావు, వైస్ ఎంపీపీ శరత్‌బాబు



కొమరాడ: విక్రంపురంలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కె.మల్లేశ్వరరావు, తహసీల్దార్ రాధాకృష్ణ



కురుపాం: పెదగొత్తిలిలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న టీపీఓ సత్యనారాయణ



కురుపాం: ఒబ్బంగిలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శివరామప్ప

పాలకొండ రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని భాసూరు గ్రామంలో సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా అరదలి గ్రామంలో ఎంపీపీ బొమ్మాళి భాను నేతృత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, సర్పంచ్ జి.చిన్నంనాయుడు, నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, ఎస్.గురువినాయుడు, అల్లేన పకీరునాయుడు, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరి, ప్రత్యేకాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

☛ కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు అన్నారు. మండలంలోని కంబవలస సచివాలయ పరిధి రాజ్యలక్ష్మీపురం, విక్రంపురం సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలక 11 రకాల సేవాలు ఉచితంగా అందుతున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళంగి మల్లేశ్వరరావు, తహసీల్దార్ రాధకృష్ణమూర్తి, ఎంపీడీఓ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

☛ కురుపాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఎంపీడీఓ శివరామప్ప అన్నారు. మండలంలోని పెదగొత్తిలి పంచాయతీ కేంద్రంలో డీపీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో, ఒబ్బంగిలో ఎంపీడీఓ శివరామప్ప ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పెదగొత్తిలి పంచాయతీ సర్పంచ్ టి.లోకనాథం, ఎంపీటీసీ ఊలక కృష్ణవేణి, ఒబ్బంగి సర్పంచ్ నూకాలమ్మ, సీఎస్‌డీటీ సాంబమూర్తి, ఉపాధి ఏపీఓ బావాజీ, కార్యదర్శులు బి.చంటి, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశవాళీ విత్తనాలతో అధిక దిగుబడులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాతోట జీవ ప్రాజెక్టు సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: దేశవాళీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మాతోట జీవప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో ప్రాజెక్టు పరిధిలోని గొరడ, రాయగడ జమ్ము, కెంగువ, వల్లాడ గ్రామాలకు చెందిన 40మంది రైతులు తయారు చేసిన దేశవాళీ విత్తనాలను శనివారం ప్రదర్శించారు. విత్తన మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, ఆకుకూరలు, కాయగూరలు వేసుకోవడం వలన అదనపు ఆదాయం వస్తుందన్నారు. నాబార్డు ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పరివేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు కొర్రలు, సాములు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతోట జీవ ప్రాజెక్టు కార్యదర్శి చిరంజీవులు, మురళీ పాల్గొన్నారు.

శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణం



దయానిధిపురం దగ్గర జరుగుతున్న రోడ్డు పనులు



నిర్మాణ దశలో గాదెలవలస-దయానిధిపురం రోడ్డు

సీతానగరం: మండలంలో ఏగోటివలస-గాదెలవలస బీటీ రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానుకు ఈ రోడ్డు అంతా పాడైంది. చినబోగిలిదరి గురాలబీట్ నుంచి గాదెలవలస వరకు పూర్తిగా ధ్వంసమైపోయిన ఈ రోడ్డు కారణంగా అటువైపుగా ప్రయాణించే చినంకలాం, ఎస్.ఎస్.పురం, గాదెలవలస, దయానిధిపురం, జయంతిరాయపురం, ఏగోటివలస వంటి 10 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడేవారు. ఇదే సమస్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాన తిరుగుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం ఏఎంసీ ద్వారా రూ.1.91 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటితో 9.1 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తొలి విడతలో గురాలబీట్ నుంచి అనంతరాయుడుపేట వరకు ఉన్న రోడ్డు మరమ్మతులు చకచకా చేపట్టారు.

ముగిసిన భాగవత సప్తాహం



భాగవతం పారాయణంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయంలో శ్రీమదాంధ్ర మహాభాగవత సప్తాహం కార్యక్రమం శనివారంతో ముగిసింది. బమ్మెర పోతన విరచిత మదాంధ్ర మహాభాగవతంను విశ్రాంత తెలుగు పండితులు పెంట సింహాచలం గత వారం రోజులుగా పారాయణం చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు సప్తాహానికి హాజరై భక్తిశ్రద్ధలతో భాగవతాన్ని విన్నారు. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

పార్వతీపురంటౌన్: అర్హతే ప్రామాణికంగా కుల, మత రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం మండలంలోని ఎమ్మార్‌నగరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మార్ నగరంతో పాటు ములగ గ్రామ సచివాలయం పరిధిలోని అర్జీదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తోందని తెలిపారు. అర్హులై ఉండి, ప్రభుత్వ పథకాలు, సేవలు అందని వారు ఎవరైనా దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలో అవి వారికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ మహోన్నతమైన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపించే ప్రజానాయకుడు మన సీఎం జగనన్న అని, ఆయనను వచ్చే ఎన్నికల్లోనూ ఆదరించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు శిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, సర్పంచ్‌లు వంగపండు లక్ష్మి, మడక కృష్ణవేణి, ఎంపీటీసీ బడే రామారావు పాల్గొన్నారు.